పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, మే, 28: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి, మరమ్మతు పనులు జూన్ 12 లోగా పూర్తి చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆదర్శ పాఠశాలల కమిటీల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్లు కేజీబీవీల ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా విద్యాశాఖాధికారి అశోక్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవితో కలిసి జిల్లా కలెక్టర్ వెంకటేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఈ నెల 30 లోగా ప్రారంభించి, జూన్ 12లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలు 282, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శపాఠశాలలు 18 స్కూళ్లలో తాగునీరు, టాయిలెట్లు, పాఠశాల గదుల మరమ్మతులు, విద్యుత్ సరఫరా పనులు సత్వరమే చేపట్టాలని తెలిపారు. ఈ పనులను ప్రధానోపాధ్యాయులు, ఎస్సీఆర్పీలు ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఇంజినీరింగ్ అధికారులు గ్రామ సమాఖ్య సంఘం సభ్యుల సమన్వయంతో పాఠశాలల్లో పనుల పురోగతిపై ప్రతి రోజూ నివేదికలు సమర్పించాలన్నారు. పనులు నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎస్సీఆర్పీలు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలను ఆదుకుంటాం..

అనాథ పిల్లలకు నిత్యావసరాలు అందజేస్తున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేశ్

కౌటాల, మే 28 : మండలంలోని పార్డీ గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన పిల్లలను అన్ని విధాలా ఆదుకుంటామని జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేశ్ తెలిపారు. మంగళవారం గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి వివరాలను సేకరించారు. గ్రామానికి చెందిన మడావి శారద మార్చి 10న మగ బిడ్డకు జన్మనిచ్చిన ఐదు రోజులకే అనారోగ్యంతో మృతి చెందింది. ది వాకర్ అనారోగ్యంతో వారం క్రితం మృతి చెందాడు. వారి పిల్లలు అజిత్ కుమార్(12), విజయ్ కుమార్ (11), శివ కుమార్ (2 నెలలు) అనాథలయ్యారు. వీరిని దివాకర్ తల్లిదండ్రులు బాయి, కాశీనాథ్ చూస్తున్నారు. రెండు నెలల బాబును ఆదిలాబాద్ శిశు గృహానికి తరలించి న్యాయ బద్ధంగా దత్తత ఇస్తామని, మిగతా ఇద్దరు పిల్లలను గురుకుల పాఠశాలల్లో చేర్పిస్తామని జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేశ్ తెలిపారు. స్పాన్సర్ షిప్ పథకం కింద ఇద్దరు పిల్లలకు ప్రతి నెలా రూ.4వేలు అందిస్తామన్నారు. అనంతరం నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందించారు. ఆయన వెంట జిల్లా బాలల పరిరక్షణ విభాగం లిగల్ అధికారి శ్రీనివాస్, సోషల్ వర్కర్ ప్రవీణ్, తదితరులున్నారు.

అనాథలకు ఆర్ఎస్పీ పరామర్శ..

తల్లిదండ్రులను కోల్పోయి అనాథ పిల్లలను మంగళవారం డా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పరామర్శించారు. ముగ్గురు పిల్లలను మంచి అనాథ ఆశ్రమంలో చేర్పించి వారి బాగోగులు చూసుకునే బాధ్యత తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలోని ఆరె సంక్షేమ సంఘ భవనంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం కేసీఆర్ నాయకత్వంలో పోరాడాలని పిలుపునిచ్చారు.

పాఠశాలలను సిద్ధం చేయాలి

నస్పూర్, మే 28 : అమ్మ అదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి, మరమ్మతు పనులను వేగవంతం చేసి, విద్యా సంవత్సరం ప్రారంభంలోగా సిద్ధం చేయాలని అధికారులను మంచిర్యాల అదనపు కలెక్టర్ రాహుల్ ఆదేశించారు. మంచిర్యాల పట్టణం హమాలీవాడలోని ప్రభుత్వ పాఠశాలలో పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ఏకరూప దుస్తుల తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎన్టీఆర్‌నగర్, హమాలీవాడల్లోని వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. వరదనీరు కాలువల ద్వారా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

తేనెటీగల పెంపకంపై శిక్షణ

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, మే 28 : తేనెటీగల పెంపకంతో రైతులు, నిరుద్యోగులు స్వయం ఉపాధి పొందవచ్చని, ఇందుకోసం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఐటీడీఏ పరిధిలో గల గిరిజన యువతీ, యువకులు, రైతుల కోసం తేనెటీగల పెంపకంపై శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తేనెటీగల పెంపకం ద్వారా స్వయం ఉపాధితో పాటు పంట దిగుబడులు గణనీయంగా వృద్ధి చెందుతాయని చెప్పారు. జీవవైవిధ్యంలో తేనెటీగల పాత్ర కీలకమని తెలిపారు. తేనెటీగల పెంపకంపై ఆసక్తి గల వారు ఐటీడీఏ కార్యాలయం సెల్ నం. 9848687871, 8897622042, 9032313933లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

- సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియాన్ని పరిశీలిస్తున్న జీఎం సంజీవరెడ్డి

రెబ్బెన : మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్

సీసీసీ నస్పూర్, మే 28: శ్రీరాంపూర్ ఏరియాలో జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి ఆదేశించారు. వేడుకల ఏర్పాట్లపై మంగళవారం సాయంత్రం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన అధికారులతో కలిసి శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియాన్ని సందర్శించారు. ప్రజలకు సౌకర్యాలు, వివిధ స్టాళ్ల ఏర్పాటు, తదితర అంశాలపై అధికారులతో చర్చించి, సలహాలు, సూచనలు చేశారు. ఆవిర్భావ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించాలని, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించే విధంగా ఉండాలన్నారు. ఉదయం 8గంటలకు నస్పూర్‌కాలనీలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం అక్కడి నుంచి షిర్కె సెంటర్ వరకు ర్యాలీ ఉంటుందని, 9గంటలకు జీఎం ఆఫీస్ వద్ద గల అమరవీరుల స్తూపం, ఆచార్య జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, జెండాను ఆవిష్కరిస్తామని తెలిపారు. సాయంత్రం 6గంటల నుంచి ప్రగతి స్టేడియంలో వివిధ స్టాళ్లను ప్రారంభిస్తామని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ ఉద్యోగులు, ఉత్తమ సేవా సభ్యులు, సింగరేణి పాఠశాల ఉత్తమ విద్యార్థులను సన్మానించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, ఫైనాన్స్ ఏజీఎం మురళీధర్, ఓసీపీ పీవో శ్రీనివాస్, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజెంట్ గోపాల్‌సింగ్, రాముడు, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, ఆనంద్‌కుమార్, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరెడ్డి, డీవైసీఎంవో రమేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో..

రెబ్బెన, మే 28 : బెల్లంపల్లి ఏరియాలో ఆవిర్భావ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ సంబంధిత అధికారులకు సూచించారు. ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో ఏరియాలోని అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వేడుకల నిర్వహణపై చర్చించారు. వేడుకల ఎజెండా, నిర్వహణ బాగుండాలని, సీఈఆర్ క్లబ్‌ను సర్వాంగా సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఏరియా ఎస్వోటూ జీఎం మచ్చగిరి నరేందర్, ఏజీఎం తిరుమల్‌రావు, పీవో ఉమాకాంత్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సివిల్(ఎస్ఈ) బాషా, సీనియర్ పీవో ప్రశాంత్, అధికారులు పాల్గొన్నారు.

వేడుకలను విజయవంతం చేయాలి

సింగరేణి మందమర్రి ఏరియా జీఎం మనోహర్

మాట్లాడుతున్న మందమర్రి ఏరియా జీఎం మనోహర్

మందమర్రి, మే 28 : జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సింగరేణి మందమర్రి ఏరియా జీఎం ఏ.మనోహర్ అధికారులకు సూచించారు. స్థానిక జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం ఏరియాలోని వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి పాఠశాల మైదానంలో వేడుకలు నిర్వహించనున్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించే విధంగా ఉండాలన్నారు. వేడుకల్లో ముందుగా ఉదయం 7.20 గంటలకు రామకృష్ణాపూర్‌లోని ఠాగూర్ స్టేడియంలో జాతీయ జెండా ఆవిష్కరించి సూపర్ బజార్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, రామాలయం చౌరస్తాలోని అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం ఉదయం 9 గంటలకు మందమర్రి జీఎం కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరిస్తామని వివరించారు. సాయంత్రం సింగరేణి పాఠశాల మైదానంలో తెలంగాణ తినుబండారాల స్టాళ్లు, ఉత్తమ ఉద్యోగులకు సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. పట్టణంలోని ప్రజలు, కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్వోటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి, ఏజీఎం ఈ అండ్ ఎం నాగరాజు, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

రక్తదానం అభినందనీయం

సీసీసీ నస్పూర్, మే 28: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు సింగరేణి ఉద్యోగులు రక్తదానం చేయడం అభినందనీయమని సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం ఏరియాలోని ఆర్‌కే-8 డిస్పెన్సరీలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎస్ఆర్పీ-1, ఎస్ఆర్పీ-3 గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 66 మంది కార్మికులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి జీఎం సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రక్తదానం చేసిన కార్మికులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థలో యువ కార్మికుల సంఖ్య పెరిగిపోతుందని, ఉద్యోగంలో చేరే యువ కార్మికులు ఆపదలో ఉన్నవారి కోసం రక్తదానానికి ముందుకు రావడం సంతోషదాయకమన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సేకరిస్తున్న రక్తాన్ని తలసేమియా, కిడ్నీ, కేన్సర్ వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న నిరుపేదలకు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. సింగరేణి సంస్థ ఉత్పత్తితో పాటు సామాజిక సేవలో ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ అసిస్టెంట్ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఏరియా కార్యదర్శి మారెపల్లి సారయ్య, డిస్పెన్సరీ పిట్ కార్యదర్శి విజయ, కామెర వేణు, తొట్ల మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పెంపు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, మే 28 : జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తు గడువు ఈ నెల 31 వరకు పొడిగించినట్టు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న ముగియగా, మరో 5 రోజులు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీల్లో గ్రూపునకు 40 చొప్పున మొత్తం 160 సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. పదోతరగతిలో సాధించిన మెరిట్ ఆధారంగా రోస్టర్ ప్రకారం ఎంపిక ఉంటుందని తెలిపారు. పదితరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు www.tsmodelschools.com వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు రుసుం లేకుండా ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని, బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.